# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అందరికీ ఆరోగ్యం అనేది కేంద్ర ప్రభుత్వ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి.**
3. **దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ కేంద్ర బడ్జెట్‌ను రూపొందించారని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు.**
4. **శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి శాఖ జూపల్లి కృష్ణారావు తెలిపారు.**
5. **ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది.**

==========================

అందరికీ ఆరోగ్యం అనేది కేంద్ర ప్రభుత్వ 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ బాగేశ్వర్ ధామ్ వైద్య శాస్త్ర పరిశోధన సంస్థకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ, ఆయుష్మాన్ యోజన, జన ఔషధి కేంద్రాల వంటి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో క్యాన్సర్ నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. రాబోయే 3 సంవత్సరాలలో దేశంలోని ప్రతి జిల్లాలో క్యాన్సర్ చికిత్సా కేంద్రాలను ప్రారంభిస్తామని ప్రధానమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..24 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం జరిగే బిజినెస్ సలహా సంఘం-బీఏసీ సమావేశంలో సభను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రేపు చర్చ జరగనుంది. ఈ సమావేశాల్లో 2025-26రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అనంతరం బడ్జెట్‌పై చర్చ జరగనుంది.

ఇదిలా వుండగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల ఏర్పాట్లకు సంబంధించి శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు సంబంధిత అధికారులతో శాసనసభ కార్యాలయంలో నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోలీసు శాఖతో సహా అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ కేంద్ర బడ్జెట్‌ను రూపొందించారని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. కేంద్ర బడ్జెట్ 2025-26పై విశాఖపట్నంలో నిర్వహించిన మేధావుల సదస్సులో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, బడ్జెట్‌లో వికసిత్ భారత్, విద్య, వైద్యానికి ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి 11 వేల 4 వందల కోట్ల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని శ్రీనివాసవర్మ పేర్కొంటూ,

వాయిస్ ... 28 సెకన్లు

---------------------------

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈ రోజు మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డి తరపున ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహిస్తారు. నిజామాబాద్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటుచేసే ప్రచార సభల్లో ఆయన పాల్గొంటారు.

---------------------------

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ -ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గంలో పైకప్పు కూలిన ఘటనలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఎస్‌ఎల్‌బీసీ ఘటన జరిగిన ప్రాంతంలో సైనిక బృందాలతోపాటు మంత్రి కూడా సొరంగంలోకి నిన్న వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో సొరంగమార్గంలో చిక్కుకుపోయిన 8 మందిని కాపాడేందుకు విపత్తు బృందాలు రంగంలోకి దిగాయని తెలిపారు. సహాయక చర్యలను ముమ్మరం చేసి వారిని రక్షిస్తామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్... 31 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-2 పేపర్-1 పరీక్షకు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ప్రాథమిక 'కీ' పై అభ్యంతరాలను psc.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 25 నుంచి 27వ తేదీ లోపు తెలపాలని సూచించింది. కాగా నిన్న నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 92 వేల 250 మంది అభ్యర్థుల్లో 86 వేల 459 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా.. వారిలో 92శాతం మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నిన్న రాత్రి స్వామి, అమ్మవార్లు రావణ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వేల

మంది భక్తుల శివనామ స్మరణల మధ్య ఉత్సవ మూర్తుల గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఐదోరోజైన నిన్న సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం తరఫున భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,..

.....వాయిస్...29 సెకన్లు....

---------------------------

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కేంద్ర బడ్జెట్ 2025-26 పై నిర్వహించిన మేధావుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, మహిళలు, యువత, రైతులు, పెట్టుబడులు ప్రధాన అంశాలుగా బడ్జెట్ రూపకల్పన చేసారని చెప్పారు.

---------------------------

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఏలో భాగంగా దుబాయ్ వేదికగా భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది. నిన్న జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్థాన్ జట్టు మొదట బ్యాటింగ్‌ను ఎంచుకుని 49.4 ఓవర్లలో 241 పరుగులను చేసి ఆలౌట్ అయింది. అనంతరం, 242 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన భారత జట్టు 42.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. దీంతో ఆరు వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై భారత జట్టు విజయం సాధించింది.

---------------------------

ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్‌కి సంబంధించిన సర్వే పనులు వేగంగా సాగుతున్నాయని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో సర్వే పనులను నిన్న ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం దాదాపు 40 కిలోమీటర్లు ఉంటుందని, ఈ మార్గంలో 40 నిమిషాల్లోనే గమ్యాన్ని చేరుకోవచ్చన్నారు.

---------------------------

ఈరోజు కేంద్ర ఎక్సైజ్ సుంకాల అవగాహనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సెంట్రల్ ఎక్సైజ్, సాల్ట్ చట్టం.. 1944 ఫిబ్రవరి 24వ తేదీన రూపొందిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈ రోజున కేంద్ర ఎక్సైజ్ సుంకాల అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. కేంద్ర ఎక్సైజ్ పన్నుల విధానాన్ని మెరుగైన రీతిలో అమలు చేసేలా ఎక్సైజ్ శాఖ ఉద్యోగులను ప్రోత్సహించేందుకు, ఈ తరహా పన్నుల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం జరుగుతోంది.

=====================